క్లుప్తంగా

జిల్లాలో 29వేల ఎకరాల పంట సాగు

గద్వాల: గద్వాల జిల్లాలో దాదాపు 29వేల ఎకరాల పంట సాగు చేసినట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్ర మ అధికారి అక్బర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాల్లో మిరప నాటినప్పటి నుంచి నిరవధికంగా వర్షాలు పడడంతో పంట పెరుగుదల సరిగా లేకపోవడం, మొక్కలు చనిపోవడం, ఎండు తెగులు ఆకుపచ్చ తెగుళ్ల సూక్ష్మపోషకాల లోపాలు మరియు కుళ్లువంటి లక్షణాలు ఉన్నాయని తెలిపారు. అధిక వర్షాలు సమయంలో కూరగాయల పంటకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

రుణమాఫీ దరఖాస్తులను పరిశీలించిన ఏడీఏ



ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ కార్డులు లేనివారి రుణమాఫీ దరఖాస్తులను ఏఓ అనిత ఆధ్వర్యంలో ఏడీఏ సక్రియనాయక్ పరిశీలించారు. మంగళవారం ఏడీఏ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టంపై రైతులతో ముఖాముఖి మాట్లాడారు. సస్యరక్షణ చర్యలు చేసుకోవాలని అవగాహన కల్పించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలతో మాట్లాడారు. అనంతరం రుణమాఫీ రైతులందరికి వర్తిస్తుందని, ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ అనిత, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



గద్వాల రూరల్: గద్వాల పట్టణ సమీపంలో అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్వీ జిల్లా కో- ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాలను సందర్శించి సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కూల్‌లో 120మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. విద్యార్థులకు కనీసం నీటి వసతి, గదులు, కిటికీలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, గురుకుల, కేజీబీవీల్లో సైతం సమస్యలు ఉన్నాయన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్రమశిక్షణతో చదవాలి



కేటీదొడ్డి: విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి మంచి ఉన్నతస్థాయికి ఎదగాలని మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని గంగన్‌పల్లి గ్రామ పాఠశాలను నోడల్ అధికారి వెంకటేశ్వర్‌రావు సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. మోడల్ లెసన్‌ను, విద్యార్థులకు నిర్వహించిన ఎన్ఏఎస్ ఎగ్జామ్‌ను పరిశీలించి పలు సలహాలు ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు



శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ పదో వార్డు రామాలయ వీధిలో అంతర్గత రోడ్లపై ఏర్పడిన గుంతలకు ఎర్రమట్టితో మరమ్మతు చేపట్టారు. ట్రాక్టర్లతో ఎర్రమట్టిని తరలించి మున్సిపాలిటీ సిబ్బందితో గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. దోమల నివారణకు, వాహనదారుల సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

రోడ్డు దిగితే ప్రమాదమే..



గట్టు: గట్టు నుంచి మల్దకల్ వెళ్లే దారిలో గంగిమాన్‌దొడ్డి స్టేజీ దాటిన తర్వాత రోడ్డు పక్కన పెద్ద గోతి ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పక్కనే ఉన్న మట్టి కోతకు గురై, పెద్ద గోతి ఏర్పడింది. రాత్రి వేళ గట్టు నుంచి మల్దకల్ వెళ్లే వాహనాలతో పాటుగా అటు నుంచి గట్టు వైపు వచ్చే వాహనదారులు ఎదురుగా వచ్చే మరో వాహనానికి దారి ఇచ్చే క్రమంలో పొరపాటున రోడ్డు దిగితే ప్రమాదం సంభవించనుంది. కొన్ని రోజులు దీన్ని ఇలాగే వదిలేస్తే తారు రోడ్డు కూడా దెబ్బతినే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బీరెల్లిలో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత
- ఐలమ్మకు ఘనంగా నివాళి అర్పించిన నాయకులు

గద్వాల అర్బన్: తెలంగాణ ఉద్యమరాలు చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి పురస్కరించుకోని మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ సేవలను కొనియడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, రాజశేఖర్ రెడ్డి, లక్ష్మణ్, నాగేంద్ర యాదవ్, నరహరి గౌడ్, కోటేష్, భాస్కర్ తదితరులు ఉన్నారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రాష్ట్రంలో భూమి లేని పేదలకు భూ పంపిణీ కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు



ఉండవెల్లిలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

వీవీ నర్సింహ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గద్వాల రూరల్: మండలంలోని బీరెల్లిలో వీరనారి చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దానయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భీసన్న, రామాంజనేయులు, శ్రీనివాసులు ఉన్నారు.

అయిజ: తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మధుకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మధు, కృష్ణారెడ్డి, రవి, గోపాల్, నరేష్, చిన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: చాకలి ఐలమ్మ తెలంగాణలోనే మొట్టమొదటి సాహస వనిత అని కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్ కుమార్ అన్నారు. ఆమె వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న, మాజీ ఉప సర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షులు రవి, నరహరి, సంజన్న, శాలు, కొండన్న, ఆటో కొండన్న పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్ర పటానికి వివిద సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇటిక్యాల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేందర్ ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



రాజోళిలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



అయిజలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు

గణపయ్యకు ఎమ్మెల్యే పూజలు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో వినాయక మండపం వద్ద వినాయకుడికి ఎమ్మెల్యే విజయుడు ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు నాల్గవ రోజు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి మండపాల వ ద్ద పిల్లలకు క్విజ్, అంత్యాక్షరి, వివిధ రకాల ఆటలు నిర్వహిస్తున్నారు. అలంపూర్ పట్టణంలో క్రాంతి యువజన సంఘం. ఆర్యవైశ్యసంఘం, అక్బర్ పేట, కట్టెలపేట, అంబేడ్కర్ కాలనీ, న్యూప్లాట్స్, చేనేత కాలనీ, పాత బస్టాండ్, గ్రామాల్లో ఏర్పాటు చేశారు. మండపాల దగ్గర ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఇన్‌చార్జి ఎస్ఐ బాషా చర్యలు చేపడుతున్నారు.

శాంతినగర్: వినాయక చవితి సందర్భంగా నాలుగు రోజులుగా పూజలందుకున్న గణనాథులను ఐదో రోజు బుధవారం నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శాంతినగర్, వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

అయిజ: మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో, మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో మండపాల వద్ద భజన మండలి సభ్యులు భజన పాటలు పాడారు. దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు.

రాజోళి: మండల కేంద్రంలో వెలిసిన మహా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పచ్చర్ల, మాన్‌దొడ్డి, తుమ్మిళ్ల తదితర గ్రామాల్లో గణపతి పూజలు నిర్వహించారు. మంగళవారం సప్తమి కావడం, నాలుగవ రోజు కావడంతో, బుధవారం నిమజ్జనం ఉంటుందని భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పూజలు చేయగా, అన్నదానం పెద్ద ఎత్తున నిర్వహించారు.

ధరూరు: మండల కేంద్రంలోని పార్థ సారథి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



పుల్లూరులో గణపయ్యకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు



శాంతినగర్‌లో గణేశ్‌కు పూజలు చేస్తున్న భక్తులు



అయిజలో వినాయకుడికి భక్తుల పూజలు



రాజోళిలో గణపతికి పూజలు చేస్తున్న మహిళలు

డీజేలకు అనుమతి లేదు

మానవపాడు: వినాయక నిమజ్జనం సందర్భంగా డీజేలకు అనుమతి లేదని, డీజేలు అధిక సౌండ్‌తో వాడితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. మండల కేంద్రంలో డీజేల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 45 విగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం నిమజ్జనానికి తరలించే విగ్రహాలకు కూడా డీజే వాడరాదని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అల్వలపాడులో మాట్లాడుతున్న బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్



జల్లాపురంలో అవగాహన కల్పిస్తున్న లక్ష్మి



పోస్టర్లను విడుదల చేస్తున్న డీసీపీఓ నర్సింహ, చైల్డ్‌లైన్ సిబ్బంది



కొండపేటలో అవగాహన కల్పిస్తున్న అధికారి

గద్వాల రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని డీసీపీఓ నర్సింహ అన్నారు. మంగళవారం గద్వాల మండలంలో కొండపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో 1098 సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. బాలల సంరక్షణ కోసం చైల్డ్‌లైన్ 1098 సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. ఏదైనా సమస్య వస్తే 1098కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. అనంతరం చైల్డ్‌లైన్ సేవలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ వెంకటేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు, చైల్డ్‌లైన్ కౌన్సిలర్ జయన్న ఉన్నారు.

లైంగికంగా వేధిస్తే జైలుశిక్ష

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి అధ్యక్షతన బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగికంగా బాలికలను, మహిళలను వేధిస్తే జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ కమిటీ అధికారి జోగు రవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండితేనే వివాహం చేయాలి

శాంతినగర్: చిన్న వయసులో బాలికలకు వివాహాలు చేస్తే అనర్థాలు జరుగుతాయని, 18 ఏళ్లు నిండితేనే వివాహం చేయాలని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సోషల్ మొబలైజర్ లత తెలిపారు. వడ్డేపల్లి పుర పరిధి లోని పైపాడులో అంగన్‌వాడీ సెంటర్‌లో బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడారు.

ధరూరు: బాలలందరు సురక్షిత వాతావరణంలో పెరగాలని బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ అన్నారు. మండలంలోని అల్వలపాడులో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తులసీరాం, చైల్డ్‌లైన్ సిబ్బంది నవీన్, అంగన్‌వాడీ టీచర్లు అనంతమ్మ, లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి, కొండపేట గ్రామాల్లో బాలల సంరక్షణపై అవగాహన నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ హాజరై బాలల చట్టాలతో పాటు వారి సమస్యలు, వారి పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఉమామహేశ్వరి, రాణి, ఆశాలు, గ్రామస్తులు ఉన్నారు.

గద్వాల: విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని షీ టీమ్ దివ్యవాణి అన్నారు. గద్వాల పట్టణంలోని విశ్వేశ్వరయ్య మెమోరియల్ స్కూల్ విద్యార్థులకు షీ టీమ్ సేవల గురించి వివరించారు. ఎవరైనా మహిళలను ఇబ్బందులకు గురైతే హెల్ప్‌లైన్ నెంబర్ 8712670312 డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీమ్ లోకేశ్వరి, తదితరులు ఉన్నారు.

మరమ్మతుతో ప్రయాణం సులభం



సాక్షి ఎఫెక్ట్..

మానవపాడు: మండలంలోని మానవపాడు నుంచి అలంపూర్ చౌరస్తాకు చెన్నిపాడు–పెద్దపోతులపాడు మధ్యలో బ్రిడ్జి ఎత్తు వల్ల ప్రయాణికులు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నెల 9న 'మండల కేంద్రానికి దారేది?' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించి ఉన్నతాధికారులు ఎత్తుగా ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా మొర్రం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా వాహనాదారులు, ప్ర జలకు ప్రయాణం సులభంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



గద్వాల అర్బన్: నిజామాబాద్‌కు చెందిన శిరీష జపాన్‌లో ఉద్యోగానికి ఎంపిక కాగా, జపాన్‌కు వెళ్లేందుకు ఆర్థిక సాయం కోసం సోషల్ రె స్పాన్సిబులిటీ బృందం సభ్యులను ఆశ్రయించారు. ఈ విషయం తెలుసుకున్న సోషల్ రె స్పాన్సిబులిటీ బృందం సభ్యులు మంగళవా రం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ కార్యా లయం ఆవరణలో శిరీషకు రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు అశోక్, నర్సింహ, ఆనంద్, ఈశ్వర్, ఐద్వా సంఘం నాయకురాలు నర్మద తదితరులు ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన డీసీఈబీ సెక్రటరీ

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలను డీసీఈబీ సెక్రటరీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి సందర్శించారు. మంగళవారం మండలంలోని మన్నాపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాక్‌టెస్ట్ పరీక్షలు, రిజిస్టర్‌ను పరిశీలించారు. డ్రాప్ అవుట్ తగ్గించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. 75శాతం హాజరు శాతం తప్పక ఉండేలా చూసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. పత్తి ఇతర పనుల్లో ఉన్న విద్యార్థులను తిరిగి పాఠశాలకు తీసుకొచ్చేందుకు గ్రామ యువకులు, గ్రామస్తుల సహకారం తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచిగా, శుభ్రత



విద్యార్థులకు నిర్వహిస్తున్న మాక్ పరీక్షను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

పాటించాలని వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ నర్సింహులు తదితరులు ఉన్నారు.

పునరావాస కేంద్రంలో సహాయక చర్యలు

గట్టు: చిన్నోనిపల్లె పునరావాస కేంద్రంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గ్రామస్తులకు ఎర్రగట్టు దగ్గర పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రంలో చిన్నోనిపల్లె గ్రామస్తులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను రెండో రోజు మంగళవారం అధికారులు కొనసాగించారు. గట్టు, మల్దకల్ తహసీల్దార్లు సరితారాణి, జుబేర్‌అహ్మద్‌ల బృందం సభ్యులు పునరావాస కేంద్రంలో ప్లాట్ల కేటాయింపు పనులు చేపట్టారు. గతంలో కే టాయించిన ప్లాట్ల వారిగా కేటాయించారు. లో టుపాట్లను గుర్తించి, అక్కడికక్కడే పరిష్కరిస్తున్నా రు. పునరావాస కేంద్రంలో విద్యుత్ పనులు, మి షన్ భగీరథ పనులు కొనసాగుతున్నాయి. ముంపు గ్రామస్తులకు అధికార యంత్రాంగం పునరావాస కేంద్రంలో భోజన వసతి కల్పించారు. రిజర్వాయర్ బ్యాక్ వాటర్ కారణంగా ఇళ్లలోకి నీరు చేరి, దెబ్బతిన్న ఇళ్లను గుర్తిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



పునరావాస కేంద్రంలో ప్లాట్లను గుర్తిస్తున్న తహసీల్దార్లు సరితారాణి, జుబేర్‌అహ్మద్

మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్‌లు పునరావాస కేంద్రంలో పనుల పర్యవేక్షణ చేస్తున్నారు. అధికారుల, నాయకుల తీరుపై నిర్వాసితులు మండి పడుతున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలను నీట ముంచారని, ముందస్తు సమాచారం లేకుండా ముంచినట్లు చిన్నోనిపల్లె గ్రామస్తులు ఆరోపించారు.

అర్హతలేని వారికి చేప పిల్లల టెండర్ ఇవ్వొద్దు

గద్వాల: చేప పిల్లల పంపిణీ టెండర్ గుత్తేదారులు రాజా ఫిషరీషామ్‌కు అర్హతలేదని ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ముదిరాజ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసిందన్నారు. రాజా ఫిషరీష్‌ఫామ్ సూర్యపేట, నల్గొండ, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో టెండర్లు వేసినట్లు తెలిపారు. ఇట్టి గుత్తేదారు చెరువులను పరిశీలించడానికి వెళ్లిన అధికారులు ఆ చెరువులో సరైన సీడ్ పెంపకం లేదని, గుత్తేదారినికి అర్హత ఎలా వచ్చిందని ప్రశ్నించారు. జోగుళాంబ గద్వాల జిల్లా మత్స్యశాఖ అధికారి గుత్తేదారుకు అనుకూలంగా నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పించినట్లు అనుమానం ఉందని పేర్కొన్నారు. న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

లారీ అదుపు తప్పి బోల్తా

మానవపాడు: జాతీయ రహదారిపై లారీ అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన మంగళవారం చేటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జాతీయ రహదారి–44పై జల్లాపురం శివారులో హైదరాబాద్ నుంచి బెంగుళూరు వైపు బెడ్‌షీట్ల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. లారీ డ్రైవర్ రాజ్‌కుమార్, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న నాగరాణి



కొండేరులో అవగాహన కల్పిస్తున్న సుజాత

మల్దకల్: గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ నాగరాణి సూచించారు. పోషణ మాసంను పురస్కరించుకుని మంగళవారం మండలంలోని పాల్వాయి హైస్కూల్‌లో పోషణమాసంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణు లు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్వామి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ సుజాత అన్నారు. ఎర్రవల్లి మండలంలోని కొండేరులో అన్నప్రాసన, అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కిశోర బాలికల్లో రక్త హీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంధ్య, అంగన్‌వాడీలు, గ్రామస్తులు, కిశోరబాలికలు ఉన్నారు.



బస్టాండ్‌లో బురద

గద్వాల ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షం పడితే చాలు బురదమయంగా మారుతుంది. బస్సులు దిగే చోట వర్షపు నీరు నిలిచి చిత్తడిగా మారింది. ప్రయాణికులు బస్సు దిగాలంటే బురదలో కాలు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక వృద్ధులు బస్సు దిగేందుకు మరింత అవస్థలు పడుతున్నారు. రూ.కోట్లతో నూతన బస్టాండు నిర్మించి ఈ దుస్థితి ఉండడం గమనార్హం. ఈ దృశ్యాలు మంగళవారం 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– గద్వాల అర్బన్